# పశువుల సంతలో దగాలు

కె. సరోజినీ దేవి

ఒక్కసారిగా చంకనున్న బిందె దభీలుమని వంటింట్లో పడేసి కచేరీ సావిట్లోకి వచ్చి సీతమ్మ "విన్నారా! ఏమండీ, విన్నారా!" అంది.

ఏవో కాగితాలు వ్రాసుకుంటున్న వాడల్లా ఆదుర్దాపడి, కళ్ళజోడు సరిచేసుకని "ఏమిటే ఆ పొలికేకలు!" అన్నాడు శంకరంగారు.

"పొలికేకలు, పొలికేకలేమిటీ? వాళ్ళ 'భాను' లేచిపోయిందట!"

"ఊఁ! లేచిపోతే నీకేంమధ్యన? ఎందుకాగోల?"

"నాకేమని అడుగుతున్నారా? నా క్కాక పోతే మరెవరికీ? మన పద్మకి తొందరగా ఏదో సంబంధం చూసి ముడివెయ్యండని ఎన్నిసార్లు చెప్పినా చీమ కుట్టినట్లయినా లేదు మీకు."

"అయితే, వాళ్ళ భాను లేచిపోవడానికీ, మన పద్మ పెళ్ళికీ సంబంధమేమిటి? ఎపుడో ప్పుడు ఎలాగా చేస్తాం. మానేస్తామా! ఇపుడేం తొందరట?"

"అయ్యో! ఇదేం ఖర్మమమ్మా! ఎంత చెప్పినా తెలియ దీయనకి!"

"ఏమిటే తెలియకపోయేదీ?"

"ఏమిటా? ఇంకో ఏడాదిపాటుంచు తే, మీ అమ్మాయి కూడా ఏ అఘాయిత్యమైనా చేస్తే మన పరువుంటుందా? ఏదో నలుగురిలో తలెత్తుకు తిరుగుతున్నాం యిప్పటికి! ఈ గౌరవంమీద ఇలా వెళ్ళిపోనివ్వండి మన రోజులు. నా మాట విని ఏదో సెటిలు చేసుకోండి" అనేసి చరచరా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఈ మాటలు నాలుగూ విన్నతర్వాత, కాగితాల మీదికి దృష్టిపోలేదు శంకరంగారికి. ఇన్నాళ్లబట్టి, ఏదో చేద్దాంలే ఏం తొందర అనుకునేవాడు కాని, పెళ్ళి అంటే ఎంత బాధ్యత తలితండ్రుల నెత్తిమీ దుందో, పెళ్ళి చేయకపోతే వచ్చే అనర్థా లేమిటో, ఒక్కొక్కటే మనస్సులో మెదులుతున్నాయి. నిజమే! ఆవిడ చెప్పిందాట్లో అసత్య మేమీలేదు. ఇప్పుడు చాలాచోట్ల జాతి విపక్షత లేకుండా అలాంటివి జరుగుతున్నాయి. ఈ చెవులతోనే తను ఎన్నో వింటున్నాడు. ఆరు నెలలేగా అవుతా అవధాన్లగా రమ్మాయి, అవతల వీధి అచ్చయ్య కాపుకొడుకుతో లేచిపోయి! తుండులా వుండేవాడు. ఆ పిల్లకోసం వూరూరా గాలించి తీసికొచ్చి పడేశా రింట్లో! ఇప్పటికీ ఎవ్వరూ ఆ గుమ్మం తొక్కలేదు. తిరిగి తీసికొస్తే మాత్రం పెళ్ళయేదెలా? పాపం! ఆ తండ్రి ఎంత బెంగ పెట్టుకున్నాడో! ఈ విధమైన ఆలోచనలతో శంకరంగారు స్నానానికి లేచారు.

పిల్ల పెళ్ళికోసం పదిహేను రోజులు సెలవుపెట్టి వెతకడం ప్రారంభించేరు వరుడిని. తిరిగిన వూరు తిరక్కుండా, చూసిన క్షేత్రాణ్ణి చూడకుండా తిరిగేరు. ప్రతిసంబంధానికీ ఏదో లోటు కనిపిస్తూనే వున్నది. చదువుంటే ఆస్తుండక, ఆస్తుంటే చదువుండక, రెండూ వుంటే పిల్లాడు బాగుండక, పోనీ ఆస్తి లేకపోతేలేదు, కాస్త చదువుకున్నవాడి కిద్దామంటే, తలకు మించిన కట్నా లడిగి, అన్నీ కుదిరితే గోత్రం కలిసి, జాతకం కలియక, ఇలా నానా అవస్థా పడ్డాడు బ్రాహ్మడు. ఆఖరికిఅనుకోకుండా ఒక సంబంధం తటస్థపడింది. అయి నింటి సంబంధమే! అన్ని విధాలా నచ్చిన సంబంధమే! సమస్తం కనుక్కొని, మనస్సులో సంతోషించి, పిల్లని చూచుకోవటానికి రమ్మని చెప్పి చక్కా వచ్చారు శంకరంగారు మర్నాటి కల్లా.

ఇంక సీతమ్మగారి సంతోషానికి అంతూదరీలేదు. ఇంక మూడు రోజుల్లో వస్తారు పెళ్ళివారు. గబగబా కచేరీ సావిడి పట్లు కొట్టించేసి, శుభ్రంగా కడిగించేసింది. అటు గుమ్మానికీ, ఇటు గుమ్మానికీ పసుపు కుంకాలు పెట్టేసింది. పెళ్ళివారు రేపు వస్తారనగా స్వంతంగా మిఠాయి తయారు చేసింది. కూతురికి రెండు వలగులు పెట్టి తలంటి నీళ్ళు పోసింది. తక్షణం శంకరంగారిని బజారుకి పంపి, పాతిక రూపాయలు పెట్టి గుంటూరు జరీచీర తెప్పిం

చింది. అనుకున్నవన్నీ సవ్యంగా జరిగిపోతున్నందుకు ఎంతో సంతోషిస్తోంది లోపల. తాంబూలాలు పుచ్చుకునే వరకూ, ఎవరితో చెప్పవద్దన్నాడు కదా భర్త అని, మనస్సుండబట్టక పోయినా, నోరు కట్టుకుంది కాని, లేకపోతే ఎందరితో నోరారా చెప్పుకునేదో తన అదృష్టం! ఇంతకీ ఆ ఏడుకొండలవాడి దయవల్ల ఈ సంబంధమే కుదరాలి! అప్పుడు తన ప్రతిభ నలుగురి దగ్గరా చాటుకోవాలి!

సరే! అనుకున్న రోజు రానేవచ్చింది. పెళ్ళివారు దిగేరు జట్కాలోంచి—పెళ్ళికొడుకూ, తండ్రీ, మరొక ముసలాయన—ఇంట్లోకి అడుగు పెడుతూంటే పక్కింట్లో ఎవరో కిసిక్కిన తుమ్మారు. ఈ సందట్లో ఆ తుమ్ము సీతమ్మగారి చెవిని పడలేదుకాని, శంకరంగారి చెవిని పడనే పడింది. కాని, ఇలాంటి మూర్ఖపు నమ్మకాలు ఆయనకు లేవు కనుక వినీ విననట్లూరుకున్నాడు.

ఫలహారాలు, కాఫీలు అయ్యాక, పెళ్ళి కూతుర్ని తీసికొచ్చి తివాసీమీద కూర్చోపెట్టారు. ఇటువంటి పెళ్ళిళ్ళల్లో, పెళ్ళివారి దగ్గర, పెళ్ళికూతురు పరీక్ష నెగ్గిందంటే సులభంగా స్కూలు ఫైనలు ప్యాసయినట్టే. ఆ పరీక్షలో కాస్త యిటూ అటూ అయ్యిందా, అమాంతంగా అరవై వంకలు పెట్టేస్తారు ఆడపిల్లకి. ఇంక ఆ దెబ్బతో ఆరునెల్లు ఏ సంబంధమూ రాదు.

అన్నీ అయ్యాక ఇంటికెళ్ళి ఉత్తరం రాస్తామని లేచారు పెళ్ళివారు. వాళ్ళని సందుమలుపుదాకా సాగనంపి ఇంటికొచ్చేరు శంకరంగారు. ఈ మూడు రోజుల్నుంచీ సతమతమైపోయిన సీతమ్మగారు ఆ రోజున సుఖంగా నిద్రపోయింది. వాళ్ళు వచ్చి చూచుకుని వెళ్ళారని ఎంత నిబ్బరంగా వున్నా, వుత్తరం ఏం వ్రాస్తారో అన్న ఆదుర్దా దంపతులిద్దరికీకూడా మనస్సులో కెలుకుతూనేవుంది.

* * *

పిల్ల నచ్చిందనీ, మీరిచ్చిన లాంఛనాలకి మా ఆడవాళ్లు ఒప్పుకొన్నారనీ, కట్నంమాత్రం ఆ ఐదు వందలూ పూర్తిచెయ్యవలసిందనీ వ్రాశారు. ఉత్తరం చదివి వినిపించేరు ధర్మపత్నికి శంకరంగారు, ఏం సలహా చెబుతుందోనని.

"ఇంతవరకూ వచ్చేక ఐదు వందలకి మొహం చూసుకుంటామా, ఒక్కగానొక్కపిల్ల. మళ్ళీ మనం ఇచ్చేదెవరికి? మనకీ అన్నివిషయాలూ నచ్చాయికదా! ఎలాగోలాగ ఆ ఐదువందలు సర్దేయండి- శుభ్రమైన సంబంధం" అని సమర్థించింది సీతమ్మగారు. వెనుకపడిన శ్రమ తల్చుకోగా, అలోచించగా అదే బాగుందనిపించింది శంకరంగారికి. మంచిరోజు చూసుకుని బయల్దేరి వెళ్ళి ఆన్నీ ఖాయం చేసుకుని వచ్చేరు శంకరంగారు.

సీతమ్మగారి హడావుడి చెప్పనక్కర్లేదు. డబ్బుకోసం తాపత్రయపడుతున్నారు శంకరంగారు. విఘ్నేశ్వరుడికి మీదుకట్టి పెళ్ళిపనులు మొదలు పెట్టేశారు. జోరుగా సాగుతున్నాయి. ఒడియాలు అప్పడాలు పెట్టేస్తున్నారు. మినపసున్ని పిండి విసిరేస్తున్నారు. వచ్చేబంధువులు వస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం వీధిలోనిలబడి, పందిరి ఎక్కడ్నుంచి ఎక్కడికి వెయ్యాలో చెప్తున్నారు శంకరంగారు. ఆ సమయంలో వున్నట్టుండి అవధాన్లుగారు వచ్చేరు శంకరంగారి యింటికి. "ఏమిటండోయ్ మహాజోరుగా జరుగుతున్నాయి పెళ్ళిపనులు" అని పలకరించేడు శంకరంగారిని. "అవునండీ, ఆట్టే వ్యవధిలేదు కదూ మరి, అందుకనీ-" అన్నారు శంకరంగారు — లోపల ఈయనెందుకొచ్చాడా అని విచారిస్తూ.

"ఐతే ఏవూరు సంబంధం ఏమిటి? అబ్బాయి ఏం చదువుతున్నాడు? కట్నమెంత? చడీచప్పుడూ లేకుండా కుదిర్చేసుకున్నారు?" అని సాగదీసాడు.

"ఆఁ చడీ చప్పుడికీ ఏముంది? వ్యవధి లేకపోయింది. అంచేత కానీ, ఇందులో రహస్యమేముంది!" అంటూ ఫలానావారి అబ్బాయి, కట్నం వగైరా అంతా వివరించేరు శంకరంగారు.

"అ, ఆ అబ్బాయా! వెనుక నేనూ విన్నాను. కాలేజీ కుర్రాళ్ళంతా చెబుతేను ఊరుకున్నాను. అంతేకాని లేకపోతేనా!"

"ఏం? ఏమన్నారు కాలేజీకుర్రాళ్ళు? పెళ్ళికొడుకు గురించే?"

"పెళ్ళికొడుకు గురించి కనుకనే మనకి కావాలి. పైవాళ్ళ గొడవైతే మనకెందుకూ? ఆ-అయినా ఇపుడెందుకు లేస్తురూ ఆగొడవ."

"ఏ గొడవండీ, నాకేమర్థమవడంలేదు. ఏమిటీ మీరనేది? ఆ చెప్పేదేదో వివరంగా చెప్పండీ!" అంటూ ఆత్రంగా అడిగారు శంకరంగారు.

"వివరంగా చెప్పడానికేముంది? ఇంతవరకూ వచ్చేక ఇపుడెందుకూ? ఏదో సలక్షణంగా వివాహం కానివ్వండి" అన్నాడు అవధాని సావధానంగా పొడుం పీలుస్తూ—.

"ఏమిటండీ కొసవరకూ తీసికొచ్చి అసలు సంగతి చెప్పక నానుస్తారేం! అసలు సంగతేమిటండీ" కంగారు పడిపోతూ అన్నారు శంకరంగారు.

"ఆఁ మీరంతగా అడుగుతున్నారు కనుక చెప్తున్నాను, ఆమధ్య కాలేజీ కుర్రాళ్ళంతా అన్నారు. ఈ అబ్బాయికోసం వెడితేనూ! ఆ అబ్బాయికి క్షయ తొలిదశలో వుందనీ!"

"ఆఁఆఁ క్షయే" అంటూ కుంగిపోయేరు శంకరంగారు. ఈమాట కాస్తా చెవినివేసి చల్లగా జారుకున్నాడు అవధాన్లు—

* * *

ఎక్కడ పనులక్కడే ఆగిపోయేయి. వచ్చిన నలుగురు బంధువులూ వెళ్ళిపొయ్యేరు. పెళ్ళివారిల్లు నిశ్శబ్దంగా వుంది.

ఈ సంఘటన జరిగిన తర్వాత నెలా పదిహేను రోజులు దొర్లిపోయాయి. మళ్ళీ శంకరంగారు అంత పట్టుపట్టి ఏ సంబంధమూ వెతకలేదు. ఏ సంబంధమూ స్థిరపడలేదు.

ఒకనాడు సాయంకాలంగా నీళ్ళకి వెళ్ళిన సీతమ్మగారు ఆదరా బాదరా పరుగెత్తింది వంటింట్లోకి. అంత కంగారుతోను తిరిగివచ్చి "ఏమండోయ్" విన్నారా?" అంటూ గావుకేక పెట్టింది.

శంకరంగారు వెనక్కి తిరిగి "ఏమిటే వినేది?" అన్నారు.

"అవధాన్లు ఎంత అఘాయిత్యం చేశాడో చూశారా? ఎంత పన్నాగం పన్నాడో! బంగారం లాంటి పిల్లాడు! నిక్షేపంలాంటి సంబంధం! ఇంతకీ మన కదృష్టంలేదు." అంటూ కళ్ళనీళ్లు పమిట కొంగుతో తుడుచుకుంది.

"ఏమిటే! ఏమిటీ రభసంతాను? సంబంధమేమిటీ?"

"రభసలాగే ఉంటుంది మీకు. ఆ సంబంధానికి, మనని మాన్పించేసి మరో పదిహేను వందలేసి తన కూతుర్నిస్తున్నాట్ట అవధాని! రేపు దశమినాడు ముహూర్తంట. నీలాటి రేవులో అమ్మలక్కలంతా చెప్పుకుంటున్నారు."

"ఆఁ ఆ సంబంధమే! నువ్వు సరిగ్గా విన్నావా?"

"ఆ సరిగా విన్నాను. వినకపోవడమేమిటీ?"

"ఆ!"అంటూ గోడకి దగ్గరగా జరిగేరు శంకరంగారు.

ఆయనకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది—పెళ్ళివారు గుమ్మమెక్కుతూంటే వినిపించిన తుమ్ము సంగతి—

---

# కైవల్యం

సుప్రసన్న

నాకు నీడలేదు, నాచుట్టూ నీడలు
నాకు తోడులేదు నాచుట్టూ గోడలు
నేను గోడలనుండి దాటి రాలేను
ఈ చీకటింలోకి గోడవతలి కిరణం చొరలేదు
నీడలలోనే జీవిస్తాను.
గోడలలోనే చచ్చిపోతాను
చచ్చిపోతాను, జీవిస్తాను
గోడలనుదాటి వెలుగు చూడలేను
వెలుగులో నానీడ చూచుకోలేను
నాకళ్లు తెరచి కనబడే కుళ్లులో నిలబల్లేను
ఈ నీడలు మాడిపోవు
ఈ నీడలు వాడిపోవు
ఈ గోడలు కూలిపోవు
నేను మాత్రం నిత్యనూతనంగా
నిలువునా వాడిపోతుంటాను
గుండెల కుంపట్లో - నిత్యరక్తస్నాతాలు
ఆశయాల బీజాలు ఎపుడూ చచ్చిపోవు
మరెప్పుడూ చివురులెత్తవు
నాకు కాలంలేదు, కాలధర్మంలేదు
నాకు సంఘంలేదు, సుఖదుఃఖాలులేవు
నాకు బంధంలేదు, నా వంటి జీవనంలేదు
ఇదేగా కైవల్యం!